క్లుప్తంగా

నేడు కొనకనమిట్లలో చెవిరెడ్డి ఆత్మీయ సమావేశం

కొనకనమిట్ల: ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోమవారం ఉదయం 10 గంటలకు కొనకనమిట్లలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి అన్నా రాంబాబు, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి హాజరవుతారని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తిరునాళ్ల శుభాకాంక్షలు తెలిపిన బూచేపల్లి

 

దర్శి: శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి తిరునాళ్ల సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వారి సతీమణి బూచేపల్లి నందిని నియోజకవర్గ ప్రజలకు తిరునాళ్ల శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సంతోషంగా, ఆనందంగా జీవించాలని, రైతులకు పంటలు సక్రమంగా పండి సుభిక్షంగా ఉండాలని అందరి వ్యాపారాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



బేస్తవారిపేట: మండలంలోని గొట్టిమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండ హారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

నేడు ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల



దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు

దర్శి: పట్టణంలోని శ్రీ సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి 54 వ వార్షిక తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ పూర్తి ఏర్పాట్లు చేశారు. సోమవారం జరిగే ఈతిరునాళ్లకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. స్వామి వారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్‌లు ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

నేడు పోలేపల్లిలో మన ఊరికి మన శివన్న

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో సోమవారం మన ఊరికి మన శివన్న కార్యక్రమం జరుగుతుందని మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొంటారన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు, జగనన్న అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధం

గిద్దలూరు రూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అరటి తోట దగ్ధమైన సంఘటన మండలంలోని దిగువమెట్ట తండా గ్రామ సమీపంలో జరిగింది. అందిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లక్ష్మీనాయక్‌కు చెందిన 4 ఎకరాల అరటి తోట వద్ద బోరు వద్ద గల విద్యుత్ తీగల షర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించి అరటి తోట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో అరటితోట దగ్ధమైంది. తోట కాపు వచ్చిన సమయంలో ఈ విధంగా ప్రమాదం సంభవించంతో సుమారు రూ.6 లకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు.



కాలిపోయిన అరటితోట

వైఎస్సార్ సీపీని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీని అందరం కలిసికట్టుగా ప్రయత్నించి గెలిపించుకుందామని గిద్దలూరు సమన్వయకర్త మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. పట్టణ శివారులో ఒంగోలు రోడ్డులో గల ఆయన అతిథి గృహంలో ఆదివారం ఉదయం నూర్ బాష సంఘం నాయకులతో రాత్రి ఆర్యవైశ్య సంఘం నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూర్‌బాష సంఘం నాయకులంతా ఐక్యమత్యంతో వైఎస్సార్ సీపీని గెలిపించుకునేందుకు కృషి చేయాలని కోరారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకోవాలన్నారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునేందకు శాయశక్తులా ప్రయత్నిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందన్నారు. నూర్‌బాష సంఘం వారి అభివృద్ధి కోసం పార్టీ పాటుపడుతుందని తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని నియోజకవర్గంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఫ్యాను గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి వేయించాలన్నారు. ఈ సందర్భంగా నూర్ భాష సంఘం నాయకులు నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించి సత్కరించారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం జగనన్న ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో నూర్ బాష సంఘం నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బూరుగులు ఖాదర్ బాష, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు దూదేకుల పెద్ద మస్తాన్, చోళ్లవీడు పీరయ్య, హుస్సేన్, దేవనగరం పి.గురవయ్య, పీరయ్య, బాబ్జి, ఆర్యవైశ్య విభాగం సంఘం నాయకులు బాదం గోపాల్, పర్చూరి నాగేశ్వరరావు, గర్రె సత్యనారాయణ, గర్రె చిరంజీవి, గర్రె వెంకటసుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీది పేదల ప్రభుత్వం

- సీఎం వైఎస్ జగన్‌తోనే పేదల ఇళ్లలో సంక్షేమ వెలుగులు
- కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు
- ఎన్నికల ప్రచారంలో మార్కాపురం వైఎస్సార్ సీపీ అభ్యర్థి 'అన్నా'



వెలిగండ్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొనకనమిట్ల: గడిచిన 58 నెలల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతులను మార్చాయని వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్ల, ఎస్సీ కాలనీ, ముసలాయపల్లి, మునగపాడు, బసాపురం, ముమ్మాయపాలెం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా పనిచేసే మనసున్న నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని కొనియాడారు. సంక్షేమ ఫలాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మీ తలరాతను మీరే రాసుకోవాలని ప్రజలను ఉద్దేశించి అన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలను కోరారు. మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్సాహంగా సాగిన ఎన్నికల ప్రచారంలో తొలుత ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి వస్తుందని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మండల సమన్వయకర్త ఉడుముల గురవారెడ్డి, రామనారాయణరెడ్డి, ఎస్సీసెల్ జిల్లా నాయకులు చిరుగూరి కోటేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డి, పార్లపల్లి సిద్దానబి, పార్టీ నాయకులు గర్రె శ్రీనివాసులు, చంద్రశేఖర్, బాలపిచ్చయ్య, అంకాల సత్యం, యంబాడి రమణయ్య, ప్రకాష్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకుడు కంకణాల రమేష్ పాల్గొన్నారు.

నాన్న ఆశయమే నాకు ఆదర్శం



బూచేపల్లికి గజమాలలు వేసి స్వాగతం పలుకుతున్న నాయకులు



ఆటోతోలి కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్న బూచేపల్లి శివప్రాద్‌రెడ్డి

- ఆదరించండి..అండగా ఉంటాం
- దర్శిలోనే అందరికీ అందుబాటులో ఉంటాం
- దర్శి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: 'నాన్న ఆశయమే నాకు ఆదర్శం..గత 20 ఏళ్ళుగా దర్శి నియోజకవర్గంలో సేవలందిస్తున్నాం. తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి చేసిన ప్రజా సేవను గుర్తించి ఇండి పెండెంట్‌గా గెలిపించి ప్రజలు ఆదరించారు. నేను, అమ్మ కూడా నాన్న బాటలోనే నడుస్తున్నాం' అని బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. దర్శి పట్టణంలోని హ్యాపీహోమ్స్‌లో మన దర్శి మనశివన్న కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన బూచేపల్లి కుటుంబానికి స్థానికులు గజమాలలు, దుశ్శాలువాలు, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ పూలు చల్లుతూ ప్రచారానికి వచ్చిన బూచేపల్లి కుటుంబానికి ఘన స్వాగతం పలికారు. బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమని నందినీలు చెరొక ఆటో నడిపి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు.నందినీ తోలిన ఆటో లో బూచేపల్లి వెంకాయమ్మకుర్చున్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటూ ప్రజా సేవ చేసుకుంటున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించారన్నారు.

ప్రజలకు సేవలందించడం టీడీపీకి ఇష్టం లేదని చెప్పారు.అందుకే చంద్రబాబు చావు తెలివితేటలతో నిమ్మగడ్డ రమేష్ చౌదరితో ఈసీకి ఫిర్యాదులు చేసి వలంటీర్ సేవలు నిలిపివేయించారని మండిపడ్డారు. రూ.120 కోట్లతో దర్శి పట్టణానికి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసే విధంగా తాగునీటి ప్రాజెక్ట్ టెండర్లు కూడా పూర్తయ్యాయని శంకుస్థాపన చేశామన్నారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు 2014లో అధికారంలోకి వచ్చే ముందు 600 పైగా హామీలు ఇచ్చి ఒక్కటీ అమలు చేయని చరిత్ర అని విమర్శించారు. తన కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌ఎం బాషా, మార్కెట్ యార్డ్ చైర్మన్‌షేక్ షకీలా అమీన్ బాషా, వ్యవసాయ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్ కాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, మాజీ ఎంపీటీసీలు ముత్తినీడి సాంబయ్య, ముత్తినీడి శిరీషా, మండల ప్రధాన కార్యదర్శి గోను నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీలు సోముదుర్గారెడ్డి , కొరివిముసలయ్య, పాలకొలను పాపిరెడ్డి, పాలకొలను రవిచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు కేసరి రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కేపీరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం,కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబురావు, జగన్నాథం మోహన్‌బాబు, ఆవుల జ్యోతి శివారెడ్డి, అలవల అంజిరెడ్డి, ఉప్పరపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయండి

- ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి



తిప్పాయిపాలెంలో మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం రూరల్: మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి సూచించారు. మండలంలోని తిప్పాయిపాలెం, బిరుదులనరవ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. గడిచిన 58 నెలల్లో సీఎం వైఎస్ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ప్రజలను కోరారు. మార్కాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మార్కాపురం ఎంపీపీ బండి లక్ష్మీదేవి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మార్కాపురం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు పత్తి వెంగన్న, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం



ముండ్లమూరు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం కోసం అర్హతగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. పూర్ణచంద్రరావు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థుల నుంచి ప్రవేశం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెబ్ సైట్ ఇచ్చామన్నారు. అర్హతగల విద్యార్థులు నేటి నుంచి మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దరఖాస్తు రుసుం 150 రూపాయలుగా నిర్ణయించామన్నారు. మిగిలిన కులాల వారు 200 రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తులను గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6వ తేదీ వరకు పొడిగించామని చెప్పారు. ఐదో తరగతి పూర్తి చేసిన మండలానికి చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెక్‌పోస్టు వద్ద విస్తృత తనిఖీలు

గిద్దలూరు రూరల్: ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ఆదిమూర్తిపల్లె గ్రామంలో గల చెక్‌పోస్టు వద్ద ఆదివారం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి ఆధ్వర్యంలో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల నుంచి గిద్దలూరుకు వచ్చే ప్రతి వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించి పంపుతున్నారు. అనుమానాస్పదంగా ఉన్న వాహన వివరాలను పూర్తిగా సేకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 284 పోలింగ్ కేంద్రాలుండగా 66 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని ఆమె తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు.

మల్లంపేటలో ఎన్నికల ప్రచారం



మల్లంపేటలో ఎన్నికల ప్రచారం

దొనకొండ: మండలంలోని మల్లంపేటలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు జోరుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వివరించారు. ప్రజలకు మరలా సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మనం అందరం కలిసికట్టుగా ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు ఓటర్లను పేరు పేరునా కోరారు. దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామ నాయకులు కాలూరి అజయ్‌రమణ, గుమ్మా ఆదినారాయణ, యరగొర్ల బాలక్రిష్ణ, బత్తుల శ్రీను, ముడమంచు చిన్న ముసలయ్య, కోట్ల ఫిలిప్, స్వామిదాసు, యోబు, బాలస్వామి, ప్రభుదాసు, యలమంద, భాస్కర్, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



గజ్జలకొండలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుక

మార్కాపురం టౌన్: ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం మార్కాపురం పట్టణం, రూరల్ గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని గజ్జలకొండ కల్వరీ కొండపై ప్రాతఃకాల ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో సాగాయి. సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. సంఘ పాస్టర్ రెవరెండ్ పి.సామ్యేల్, సెక్రటరీ ఎ.విల్సన్, ట్రెజరర్ జె.ప్రభుదాస్, సంఘ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో ఈస్టర్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘ కాపరి సీహెచ్ యేసుదాసు దైవ సందేశాన్ని, బి.ప్రవీణ్‌కుమార్ వాక్య సందేశం అందించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు. రాయవరంలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కె.జాన్ సందేశాన్నిస్తూ క్రీస్తు సమస్త మానవాళి పాపాలపై విజయం సాధించారని, క్రీస్తు చూపిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో అఖిల, శిరీష, జయన్న, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి



డిప్యూటీ సీఎం అంజాద్‌బాషాను సన్మానిస్తున్న షంషేర్ ఆలీబేగ్

- ముస్లింలకు డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా విజ్ఞప్తి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులతోపాటు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విజయానికి ముస్లింలు కృషి చేయాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా సూచించారు. ఇటీవల మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన షంషేర్ ఆలీబేగ్ ఆదివారం మార్కాపురంలోని మైనార్టీ నేతలతో కడపకు వెళ్లి డిప్యూటీ సీఎంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాడని, ఆ విషయాన్ని మైనార్టీలకు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించినట్లు షంషేర్ తెలిపారు. ఆయన వెంట ముతవల్లి సంఘ ప్రెసిడెంట్ షఫీ, జామియా మసీదు ముతవల్లి సర్దార్ అలీబేగ్, జిలానీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

పూజా కార్యక్రమాల్లో బూచేపల్లి వెంకాయమ్మ



పూజా కార్యక్రమాలలో బూచేపల్లి వెంకాయమ్మ, నందిని

దర్శి: పట్టణంలోని చింతల పాలెంలో నిదానంపాటి లక్ష్మీ అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు.
ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. వెంకాయమ్మతో పాటు కోడలు నందినీ కూడా ఈ పూజాకార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలిపై వేటు

సాక్షి ఎఫెక్ట్..

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారులో ఈ నెల 29న టీడీపీ ప్రచారంలో పాల్గొన్న మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు బొంతా లక్ష్మీదేవిపై నియోజకవర్గ ఎన్నికల అధికారి డి.నాగజ్యోతి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. సాక్షి దినపత్రికలో అంతా మా ఇష్టం అనే కథనంలో భాగంగా టీడీపీ ప్రచారంలో మిడ్ డే మీల్స్ నిర్వాహకురాలు అనే శీర్షికపై స్పందించారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపుతున్నామని ఆర్‌ఓ నాగజ్యోతి తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎవరు ప్రవర్తించిన వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.